




# భిక్షువు

## శైలకుమార్

మహోన్నవృక్షాల్ని సైతం నిట్టనిలువునా మలమల మాడ్చేసేంత వేడిగా ఎండ. దట్టంగా వృక్షాలు వున్నప్పటికీ వేడికి కాగిపోతూ వుంది ఆ మహారణ్యం. భూమిని చీల్చుకుపోయేంత వాడిగా చెట్ల ఆకుల సందుల నుంచి పడుతున్న సూర్య కిరణాలు. గాలి వీచడం లేదు. గొంతు తడారిపోవడంతో పక్షులూ శబ్దాలు చెయ్యడంలేదు.

ఆ మహా వృక్షాల ప్రక్క నుంచి మోకాలి లోతుగా ప్రవహిస్తున్న సెలయేరు. సెలయేటి మధ్య భాగం దాకా వచ్చిన మర్రి ఊడలు.

సెలయేటి మధ్య నిలబడి ఎండవేడి, కడుపులో దహించి వేస్తున్న ఆకలి బాధ భరించలేక వంగి, శక్తి హీనంగా దోసిళ్ళతో నీటిని అందుకోబోయాడు ఆ యువకుడు. నీరసము, నిస్సత్తువలతో శుష్కించిన అతని శరీరం ఆ కాస్త బాధమా ఓర్చుకోలేక అదుపు తప్పింది. మూసుకుపోతున్న కళ్ళతో తూలి ముందుకు పడబోయి మర్రి ఊడల్ని పట్టుకున్నాడు. శరీరం అదుపు తప్పిపోతూ వుంది. మెల్లగా భారంగా రెండడుగులు వేసి శోషవచ్చి పడిపోయాడు. సగం దేహం నీళ్ళలో, సగం దేహం ఒడ్డున.

ఆ అడవిలో సంచరిస్తూ దాహం వేయడంతో సెలయేటి ఒడ్డుకు వచ్చింది దాహం తీర్చుకోవడానికి ఓ యువతి. విద్యుల్లతా పుంజములతో పోటీ పడుతున్న మేని లావణ్య కాంతి. శిరీష సుమకోమల సుకుమారత నిండిన శరీరం. వికసించిన నవ యవ్వన శరీర భారంతో నడవలేకపోతోంది ఆమె.

అడుగులో అడుగు వేస్తూ వచ్చిన ఆమె ఆ యువకుడ్ని చూసి దగ్గరగా వచ్చింది. నిర్మానుష్యమైన ఆ మహారణ్యంలో స్పృహ తప్పి పడి వున్న ఆ యువకుడి వంక ఆశ్చర్యంగా చూసిందామె కొన్ని క్షణాలు. మెల్లగా అతడి శరీరాన్ని పైకి లేపి, ఆయాసపడుతూ అతికష్టం మీద దగ్గరగా వున్న ఓ చెట్టు నీడకు చేర్చి, వెల్లకిలా పరుండబెట్టింది.

ఒక్క క్షణం ఆమె కళ్ళల్లో కోటి మెరుపులు. చక్రవర్తుల్ని మించిన రాజఠీవితో, తరుణ వయస్సు తరుణుల కన్నా సుకుమారంగా వున్న అతడిని అలాగే చూస్తూ వుండిపోయింది కొంతసేపు. అన్నాళ్ళ నుంచీ అమూల్యంగా దాచుకున్న ఆమె వన్నె, చిన్నెల కన్నె సొగసులన్నీ పులకించి, పల్లవాధర ఆశల రాసులన్నీ పల్లవించి పారవశ్యంతో శరీరం జలదరించింది ఆమెకు.

మెల్లగా పారవశ్యం నుంచి తేరుకుని దోసిలితో నీళ్ళు తీసుకుని వచ్చి అతని ముఖంపై చల్లింది. స్పృహ లోంచి తేరుకున్న అతడు కళ్ళు తెరవబోయి తెరవలేక నిస్సత్తువుగా తిరిగి మూసుకున్నాడు. శుష్కించి పోయిన అతడి శరీరాన్ని, ముడుచుకుపోయిన అతడి కడుపును గమనించి అడవిలోకి పరుగెత్తి అందిన అన్ని రకాల ఫలాలను తీసుకుని వచ్చింది ఆ యువతి.

ఆ యువతి అందించిన ఫలాలను భుజించి ఆకలి బాధ తీరడంతో నెమ్మదిగా కళ్ళు తెరిచాడు ఆ యువకుడు.

''కృతజ్ఞతలు తల్లీ! ఎన్నో రోజులుగా క్షుద్బాధచే తపించి శరీరాన్ని వదిలి పోనున్న ప్రాణాలను రక్షించి, ప్రాణదాత వైనావు'' అన్నాడు నీరసంగా.

''అసహాయంగా పడి వున్న సాటి మనిషికి సానుభూతితో సహాయం చేయడం కూడా గొప్పేనా'' అంది తీయగా ఆ యువతి.

మెచ్చుకోలుగా ఆమె వైపు చూసి నీరసంగా చెట్టు బోదెను ఆనుకున్నాడు ఆ యువకుడు.

''తమరెవరు స్వామీ?'' సందేహంగా అడిగింది ఆ యువతి.

''నేనో భిక్షువుని తల్లీ!''

''మానవ సంచారం లేని ఈ మహారణ్యాలలో, ఇంత సుకుమార శరీరంతో ఏ భిక్ష కోసం అన్వేషిస్తున్నారు స్వామీ'' అంది ఆ యువతి నవ్వీ నవ్వక నవ్వుతూ.

''జ్ఞాన భిక్ష కోసం తల్లీ. దుఃఖ సంకెలమైన మానవ జీవితానికి సుఖాన్ని, శాంతిని ప్రసాదించే జ్ఞాన మార్గం కోసం నా అన్వేషణ'' అన్నాడు మేఘ గంభీర స్వరంతో.

''అన్వేషణ అడవిలోనా స్వామీ'' అమాయకమైన కళ్ళు టపటపలాడిస్తూ అంది. ఆమె కంఠంలో చిగురాకులు మేసిన శ్రమకే సోలిన కోకిల స్వరంలోని మత్తు.

''అవును తల్లీ! మనిషికి ప్రకృతే గురువు, జీవరాసులకు నెలవు. ఉగ్రమైన ఉష్ణాన్ని తాను భరిస్తూ, మనకే శీతలచ్ఛాయనిస్తున్న ఈ తరువు నీకేమీ బోధించడం లేదా'' అడిగాడు.

అర్థంకానట్టు చూసింది అమాయకంగా ఆ యువతి. చిరుదరహాసం అతని ముఖంలో.

''ఎంత నిర్మలత, ఎంత లావణ్యం, ఎంత సుకుమారం, ఈ యువకుడా అన్వేషి'' అనుకుందా యువతి మనసులో. అంతలో ఆమెలో ఏదో జ్ఞాపకపు మెరుపు.

ఆ యువకుడి ముఖాన్ని సూటిగా చూసింది.

''ఆలు బిడ్డలను, సమస్త రాజ్య సుఖాలను తృణప్రాయంగా త్యజించి వచ్చిన కపిలవస్తు నగర రాకుమారులు మీరేనా స్వామీ!''

''ఔను తల్లీ గతంలోని గౌతముడిని. నేడు సిద్ధిని, అర్థిస్తున్న వాడిని. వ్యథాతప్తమైన మానవ జీవితాలకు శాంతి పథం చూపించాలనే ఈ మహాప్రస్థానం.''

ఆశ్చర్య పోయిందా యువతి ఓ మహా సామ్రాజ్యానికి సర్వంసహా చక్రవర్తిగా సింహాసనాన్ని అధిష్టించవలసిన ఆ యువకుడు, భిక్షువై ఓ వృక్షాన్ని ఆనుకుని తన ఎదురుగా వున్నందుకు

''మార్గం అవగతమైందా''

''దుర్గమంగా వుంది తల్లీ. నిరాహారంగా శరీరాన్ని శుష్కింప చేయటం సరికాదని నీవిచ్చిన ఆహారం బోధించింది. ఈ క్లేశంలో గ్రహించింది లేశమే''

''మార్గదర్శనానికి మాత్రై మీరు ఆహారం విసర్జించారా. ఆత్మహింస పాపం కాదా స్వామీ'' అమితమైన ఆశ్చర్యానికి లోనై అడిగింది.

కాళ్ళు రెండు దగ్గరికి చేర్చి ఎడమ చేయి నేలకు ఆనించి ఆ సుందర గంభీర విగ్రహం మాటల్ని మనసారా ఆలకించాలని కూర్చుందా యువతి.

''సమష్టి ప్రయోజనానికి వ్యష్టి శ్రమించటంలో పాపం లేదు తల్లీ. స్వార్థాన్ని త్యజించినప్పుడు సమస్తమూ మంగళమే''

అంతవరకు ఆమెకు తెలియని ఏవో కొత్త లోకాల వాకిళ్ళు తెరచుకుంటున్నట్టుంది ఆమె ముందర. సఖుల సరసరాగాల మధ్య భీత హరిణాల వెంట పరుగెత్తటం, తేట నీటి సరస్సులలో స్నానమాచరించటం తప్ప మరేమీ తెలియని ఆ యువతికి అతని మాటలు లోకాన్ని చూపిస్తున్నాయి. యదార్థం బోధిస్తున్నాయి.

"మానవుని దుఃఖానికి హేతువేమిటి స్వామీ" తెలుసుకోవాలన్న కోరిక ఆమె స్వరంలో.


"కోరికలు తల్లీ. ఆ కోరికలనే పరిత్యజించిన వాడు దుఃఖానికి అణువంత ఆస్కారం కూడా వుండదు"

"ప్రపంచంలో ప్రతిదీ కోరికే కదా స్వామి. ఏది కోరిక, ఏది కాదు."

"యవ్వనం తృళ్ళిపడుతున్న ఆ యువతిలోని తాత్విక జ్ఞానానికి అబ్బురపడ్డాడు గౌతముడు.

"జీవన యానంలో శరీర ధారణకు అనునిత్యం అవసరమైనవి కోరికలు కాదు తల్లీ. అంతకంటే ఎక్కువ కావాలని, అంతా కావాలని అనుకోవటమే కోరిక."

అర్థం కాలేదామెకు. అమాయకమైన ముఖం ఆశ్చర్యాన్ని దాల్చినప్పుడు ఏదో వింత శోభను సంతరించుకొంటోంది.



నవ్వాడు ప్రసన్నంగా. ఎంతో శాంతి ఉపశమనం కలిపించాయామెకు ఆ చిరునవ్వులో.

"క్షుదాబాధితుడు ఆహారం కావాలనుకోవటం కోరిక కాదు తల్లీ. కాని పంచభక్ష్యాలు కావాలనుకోవటం కోరిక" వివరించాడు.

"మరి మనిషి కర్తవ్యం"

"నీ కవగాహన కాలేదా? తామేమీ కోరుకోకుండా మధుర ఫలాల్ని మానవుల కందిస్తున్న ఈ మహా వృక్షాలు నీకేమీ బోధించలేదా?"

"శ్రేయస్సు బాలను గ్రహించుకోగల నేర్పు, శక్తీ నాకు లేవేమో స్వామీ"

"జ్ఞానానికి వయసుతో నిమిత్తం లేదమ్మా. ప్రేమ పాలించాలి ఈ ప్రపంచాన్ని. ప్రతి మనిషీ తానేమీ కోరుకోకుండా ఇతరులకు అన్నీ ఇవ్వగలగాలి. అప్పుడే ఇలాతలంలో దుఃఖం ఎక్కడా కనిపించదు. సర్వం శాంతిమయం అవుతుంది."

పూర్తిగా అర్థమైంది ఆమెకు. గౌతముడిపట్ల గౌరవం, ప్రేమ పొంగిపొరలాయి ఆమె హృదయంలో.

"బాటసారిపై ఇంత ప్రేమ చూపించి ఆదరించిన నీ పేరేమిటి తల్లీ"

"మేఘ"

"తన అమృత వృష్టితో ధరణి దాహం తీర్చే జలధరానివా తల్లీ."

"ఎలజవ్వని ఎల నాగను తల్లీ అని సంబోధించటంలో తమ అంతర్యం" నిష్ఠూరంగా అంది.

"తల్లిలా ఆదరించావు కదమ్మా"

"కాని స్వామీ మీ కుమారుడికి తల్లి నవ్వాలని నా ఇచ్ఛ" కోరిక వెలిబుచ్చింది సిగ్గుపడుతూ. నిర్ఘాంత పోయాడు గౌతముడామాటకు.

"సర్వం పరిత్యజించిన పరివ్రాజకుడితో పరిహాసమా తల్లీ"

"పరిహాసం కాదు స్వామీ మనోభీష్టం."

"కూడనిది కోరుతున్నావు తల్లీ. దుఃఖ భాజనము తుచ్ఛము అయిన సంసార బంధంపై రోసి జ్ఞాన కాంతిః గవేషిస్తున్నాను. నాపట్ల ఈ భావం న్యాయం కాదు' చిన్నబోయింది మేఘ ముఖం. నీలి జలధారయైంది ఆమె మోము.

మెల్లగా పైకి లేచాడు గౌతముడు ప్రయాణాని ఉద్యుక్తుడవుతూ.

"స్వామీ" కరుణ జాలువారింది ఆమె కంఠంలో

"నీ పల్లవాధరంపై రాగ పల్లవులు పలికించగ పడుచు వాడిని వలచి వలపించుకో తల్లీ."

"ఎదుట వారి నుండి ఏమీ కోరకుండా వార కోరింది ఇవ్వాలన్న మీరేనా స్వామీ నన్ను కాదంట న్నది"

మందహాసం చేశాడు గౌతముడు.

"నీది స్వార్థం తల్లీ. దాన్ని త్యజించిన నాడు లోకం ప్రేమాలయం" కదిలాడు గౌతముడు.

"వెళ్ళక తప్పదా స్వా..." అడిగింది ఆ మ యోగిని తాను ఆపలేన...

"అనివార్యం తల్లీ. గమ్యం చేరేవరకు గవేష తప్పదు"

"నాకు మీ సందేశం స్వామీ" కలువ పూల రేక నుంచి కరిగి జారుతున్న తుహిన బిందువుల్లా ఆ కళ్ళలో నీళ్ళు.

"నన మాటల్ని మరొక్కసారి మననం చేసుకి నీలోనే పుడుతుంది జ్ఞానం."

కదిలాడు గౌతముడు అడుగులో అడుగు వేస్తు

అతని ఆకారం కళ్ళకు కనిపించేంత వరకు అలానే చూస్తూ వుండిపోయింది మేఘ.

కొన్ని సంవత్సరాల కాలం కలిసిపోయింది కాల గర్భంలో అనంతాన్వేషణ ఫలించిన గౌతముడు సిద్ధి పొంది బుద్ధుడయ్యాడు. అతని జ్ఞాన బోధకు పులకించి పోతోంది అవని. మానవాళికి కొత్త మార్గం చూపించిన ఆ మార్గదర్శికి దేశ విదేశాల నుంచి ఎందరో శిష్యు లయ్యారు. భారతదేశపు మొట్టమొదటి భౌతికవాది గళం సమస్త భూగోళంలో ప్రతిధ్వనిస్తూ మానవుల నిగళాల్ని ఛేదిస్తోంది. ఎటు విన్నా "బుద్ధం శరణం గచ్ఛామి" అన్న నాదం. ఎటు చూసినా ప్రశాంత గంభీరమైన ఆ సిద్ధార్థుని ప్రసన్న వదనం. కదులుతున్న ఆయన వెంట సమస్త మానవాళి.

దేశ సంచారం చేస్తున్న ఆ మహాయోగి శిష్యులతో పాటు సత్యవర్తన నగరంలో మజిలీ చేశారు. నగరం వెలుపల వున్న ఓ మామిడి తోట ఆ యాత్రికుల విశ్రాంతి వాటిక.

నగరం నగరమే కదలివచ్చింది ఆ చైతన్యమూర్తి సందర్శనానికి. అందరినీ ఆప్యాయతతో చెరగని చిరు నవ్వుతో వీక్షించాడాయన. ప్రయాణపు బడలిక నుంచి ఆయన విశ్రాంతి పొందేందుకు అనుమతినిమ్మని ప్రజ లకు విన్నవించారు పురప్రముఖులు. ఆ దివ్యమూర్తి సందర్శనా భాగ్యం లభించిందన్న ఆనందంతో వెనక్కి మరలింది సత్యవర్తనా నగర ప్రజ.

ఉషోదయమైంది. మందగమనంతో వచ్చిన శీతల పవనాంకురాలు ఆ సంఘమిత్రులను ఎంతో సేద దీర్చాయి.

మాత ఫలవృక్షం క్రింద శిష్యులకు జ్ఞాన బోధ చేసి నగరంలోకి బయలుదేరాడు బుద్ధుడు భిక్ష కోసం. అతని వెంట శిష్యులు.

సమస్త ప్రపంచానికే జ్ఞాన భిక్ష పెట్టిన ఆ దివ్య మూర్తి జోలెలో భిక్షవేయడానికి సిద్ధమై వాకిట్లో ఎదురు చూస్తూ వున్నారు నగరవాసులంతా. తాము జీవించి వున్నది ఆ భిక్ష వేయడానికే అన్న భావం వారి ముఖాల్లో, ఆ భిక్షే మోక్షం ప్రసాదిస్తున్న నమ్మకం వారి మనస్సుల్లో. ప్రతి ఇంటి దగ్గరా ఆగి భిక్ష స్వీకరిస్తున్నాడు బుద్ధుడు. అతడి వెంట శిష్యులు, పురప్రముఖులు.

ప్రధాన వీధి మలుపు తిరిగి ఓ ఇంటి దగ్గరకు వెళ్ళబోతున్న బుద్ధుడిని ఆపారు పురప్రముఖులు.

"ఆ గృహంలో మీరు భిక్ష స్వీకరించరాదని మా మనవి స్వామి."

"కారణం" ప్రక్కనే వున్న శిష్యుడు అడిగాడు ఆ పురప్రముఖుడిని. ఆ ఇంటివేపు దృష్టి సారించాడు బుద్ధుడు. మధుర ఫలాల్ని పళ్ళెరం నిండా పెట్టుకుని ఆశగా ఎదురుచూస్తూ వుంది ఓ స్త్రీ.

"ఆమె జారిణి పతిత" సమాధానం ఇచ్చాడు ప్రముఖుడు.

"అయినా ఆమె మనిషి" ప్రశాంతంగా అన్నాడు బుద్ధుడు.

"కారణజన్ములయిన మీరు ఆ కళంకి వద్ద భిక్ష స్వీకరిస్తారా స్వామీ!" బాధగా అన్నాడు.

"మనిషిని మనిషిగా చూడడం తప్ప మరోలా గ్రహించకూడదయ్యా! కళంకం లేనివారెవ్వరు? కారణం లేకుండా జన్మించిన వారెవ్వరు?" మెల్లగా కదిలాడు బుద్ధుడు ఆ స్త్రీ దగ్గరికి. ఆర్ద్రమైన కన్నులతో ఆశగా చూస్తూ వుంది ఆమె.

ఆమెను సమీపించిన బుద్ధుడి మనసులో ఆమె ఎక్కడో చూసిన భావన.

"గుర్తించారా స్వామీ నన్ను?"

"మానవులందరూ నాకు ఒక్కలాగే కనిపిస్తారు తల్లీ!"

"లోకం స్వైరిణి అని పిలుస్తున్నా నన్ను ఇంకా తల్లీ అనే సంబోధిస్తున్నారా స్వామీ."

జ్ఞాపకం వచ్చిందా యోగికి. ఆమె అలనాడు అతని ప్రాణాలను కాపాడిన మేఘ.

"నీవు మేఘవు కదమ్మా" దయగా చూస్తూ ప్రశాంతంగా అడిగాడు.

కన్నీటిబొట్లు నేల రాలుతూవుండగా తల ఊపింది ఆమె ఔను అన్నట్టు.

"ధరణి దాహాన్ని ఇలా తీరుస్తున్నావా తల్లీ!"

"ఎదుటివారి నుంచి ఏమీ కోరకుండా వారికి అన్నీ ఇవ్వమన్న ఆనాటి మీ సందేశాన్ని ఇంకా ఆచరిస్తున్నాను స్వామీ!"

చిరునవ్వు తప్ప ఎప్పుడూ ఏ భావము కనిపించని బుద్ధుడి ముఖంలో ఆశ్చర్యపు రేఖ అప్పుడు పొడ చూపింది.

"నగరంలోని వృద్ధులు, యువకులు అందరూ నా అందాన్ని అందుకోవాలని అభిలషించారు. ఈ పాంచ భౌతిక శరీరం అశాశ్వతమనీ, సుఖం క్షణభంగురమనీ నేను వివరించాను. కాని మోహాంధకార పరివృతులైన వాళ్ళు నా మాటలు లక్ష్యపెట్టలేదు స్వామీ" సంవత్సరాల నుంచి ఆమెలో నిబిడీకృతమైన విషాదం వెలికి వచ్చింది ఆ జ్ఞానమూర్తి ముందు.

భిక్ష కూడా స్వీకరించక ఆమె మాటల్ని వింటు న్నాడు. శిష్యులు, పురప్రముఖులు కూడా అచేతనంగా నిలబడ్డారు వారిని చూస్తూ, వారి మాటలు వింటూ.

"వాళ్ళు కోరిన ఈ తుచ్ఛ శరీరాన్ని వాళ్ళకు అర్పించానే తప్ప వారి నుంచి ఏమీ కోరుకో లేదు స్వామీ. ధనాన్ని కానీ, శారీరకమైన సుఖాన్ని కానీ వాళ్ళ నుంచి నేను ఆశించలేదు. మోహాభరిత మానసాలతో వాళ్ళు నా శరీరాన్ని స్పృశిస్తున్నప్పుడు కూడా నిర్వి కారంగా, నిర్విచారంగా వున్నానే తప్ప పారవశ్యపు ఆనందానుభూతిని ఈషణ్మాత్రంగానైనా నేను కోర లేదు, పొందలేదు స్వామీ" అసంకల్పితంగా కన్నీళ్ళు జాలువారుతున్నాయి ఆమె కనురెప్పల నుంచి.

"మేఘా" శాంత గంభీర స్వరంతో పిలిచాడు.

"సుఖదుఃఖాతీత స్థితికి చేరిన నీ స్వాంతంలో ఈ అశ్రువులు ఎందుకు తల్లీ?"

తేరుకుంది ఆ మాటకు మేఘ. ఒక చేత్తో అశ్రువులు తుడుచుకుంది. భిక్షకై చేతులు ముందుకు సాచాడు బుద్ధుడు. ఆనందంతో, వణుకుతున్న చేతులతో పళ్ళెరంలోని ఫలాలు ఆ మహామనిషి జోలెలో వేసింది మేఘ.

"చెప్పండి స్వామి నేను కళంకినా?"

"జలధరం నుంచి జారి ఇంకా నేల చేరని నీటి బిందువులోని నైర్మల్యం, పంకంలో పుట్టిన పద్మంలోని పావిత్ర్యం వున్నాయి తల్లీ నీలో."

ఆమెను ఆశీర్వదించి ముందుకు కదిలాడు బుద్ధుడు. "స్వామీ" హృదయపు లోతుల లోపల నుంచి వచ్చిందా పిలుపు. బుద్ధుని పాదాలు నేల ఆనిన చోట పసివాడిన లతలా వాలిపోయిందామె.

బుద్ధుడు సాగిపోతున్నాడు ప్రశాంతంగా, నిర్మలంగా. అతని వెంట శిష్యకోటి. మానవాళికి మహోన్నత మానవతా లోకాల ద్వారాలు తెరిపించిన గానం, వేదం వారి వెంట.

"అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ."

(మానవాళిని మహోన్నత శిఖరాలకు తీసుకువెళ్ళిన ఆ "మహాచైతన్యద్యుతికి" ఈ అక్షర నీరాజనం — రచయిత)

